క్లుప్తంగా

శని త్రయోదశి పూజలు



పూజలందుకున్న శనీశ్వరుడు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆల యంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో శనివారం శని త్రయోదశి పూజలు నిర్వహించారు. భక్తులతో శనీశ్వరుడికి తైలాభిషేకాలు చేయించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన నాగాలాండ్ బృందం



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న నాగాలాండ్ బృంద సభ్యులు

గంట్యాడ: మండలంలో సుపోషిత పంచాయతీగా ఎంపికైన బుడతానపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని నాగాలాండ్ బృందం శనివారం సందర్శించింది. కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని బృంద సభ్యులు తోక్యుసుమ, విస్కో హియాహి పరిశీలించారు. గర్భిణులు,బాలింతలు, పిల్లల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలపై అంగన్‌వాడీ సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. వారి వెంట ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం,పీఓ ఉమా భారతి, తదితరులు ఉన్నారు.

గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురంలో రైల్వే వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణకు తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు ఆధ్వర్యంలో ఆ గ్రామ సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఏ విధంగా వంతెన నిర్మాణం చేపడితే గ్రామస్తులకు నష్టం జరగకుండా ఉంటుందనే అంశాలపై గ్రామపెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చర్చించారు. ఒకవైపు నిర్మాణం చేపడితే ఇళ్లు నష్టపోవాల్సి వస్తుందని, మరోవైపు నిర్మాణం చేపడితే పంట పొలాలను నష్టపోవాల్సి వస్తుందని గ్రామస్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి ఏకాభిప్రాయానికి రావాలని, సోమవారం సర్వే చేసి ఉన్నతాధికారులకు అందించేందుకు నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఆర్ఐ అచ్యుతరావు, మండల సర్వేయర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచ పశువైద్య దినోత్సవం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు, అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాలలో శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో శని వారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. విజేలకు అతిథులు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ జగదీశ్వరరావు, గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్యలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఆఫీసర్ ఇన్‌చార్జ్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ ఎం. మురళీధర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదమానాపురం సర్పంచ్‌గా ఆదినారాయణ



అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను చూపిస్తున్న ఆదినారాయణ

దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామ పంచాయతీ తాత్కాలిక సర్పంచ్‌గా గురుబిల్లి ఆదినారాయణను నియమించినట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. సర్పంచ్ గొటివాడ దాసు ఇటీవల గుండెపోటుతో మరణించడంతో ఉప సర్పంచ్ ఆదినారాయణను సర్పంచ్‌గా కొనసాగాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదినారాయణకు ఎంపీడీఓ ఆ ఉత్తర్వులను అందజేశారు. ఆదినారాయణకు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, గ్రామపెద్దలు శుభాకాంక్షలు తెలిపారు.

నువ్వులో.. నవధాన్యాల సాగు..

అన్ని విధాలా బాగు

- నువ్వుల పంటలో పీఎండీఎస్ విధానంలో నవధాన్యాల సాగుకు ప్రణాళిక
- రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది
- వేపాడ మండలంలో సాగు విస్తీర్ణ లక్ష్యం: 4,333 ఎకరాలు
- రైతులకు తొలివిడతగా రాయితీపై పంపిణీ చేసిన విత్తనాల కిట్లు: 3,500
- రెండో విడత పంపిణీకి విత్తన కిట్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది



వేపాడ మండలంలోని కొండగంగుబూడిలో నువ్వు పంటలో నవధాన్యాల సాగు (ఫైల్)



బొద్దాంలో నవధాన్యాల విత్తన కిట్లను రైతులకు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది(ఫైల్)



ఆకులసీతంపేటలో నవధాన్యాల విత్తన కిట్లను తయారు చేస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది(ఫైల్)

వేపాడ: మితిమీరిన రసాయన ఎరువుల వినియోగం వల్ల నిస్సారమవుతున్న భూములను తిరిగి సారవంతం చేసేలా, అదనపు ఆదాయం ఆర్జించేలా రైతులను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చైతన్యవంతం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రధాన పంటకు ముందుగా వేసవి లో పీఎండీఎస్ (ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్)విధానంలో నువ్వులు, నవధాన్యాలను సాగు చేసేలా అవగాన కల్పిస్తూ, ప్రోత్సహిస్తున్నారు. పీఎండీఎస్ విధానంలో ప్రధాన పంటగా నువ్వులు, అంతర పంటలుగా నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని చెబుతున్నారు. వేపాడ మండలంలో పీఎండీఎస్ విధానంలో 4,333 ఎకరాల్లో వీటిని సాగు చేయించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, రైతులకు రాయితీపై నువ్వులు, నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఎకరానికి మూడు కిలోల నువ్వులు, ఒక కిలో నవధాన్యాల (గోంగూర, బొబ్బర్లు, తెల జొన్న, బరబాటి, బెండ, పొద్దుతిరుగుడు, మొక్క జొన్న, సజ్జలు, గంటెలు) విత్తనాలను రాయితీపై రూ.100కు అందిస్తున్నారు. ఇప్పటికే తొలివిడతగా రైతులకు 3,500 కిట్లను పంపిణీ చేయగా, రెండో విడతలో పంపిణీకి మరో 833 కిట్లను సిద్ధం చేస్తున్నారు.

ప్రయోజనాలు..

- నవధాన్యాల సాగుతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది.
- నవధాన్యాల చేను నేలను పూర్తి కప్పి ఉంచడం వల్ల భూమిపై పొర కోతకు గురికాదు.
- నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందడంతో పాటు నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- మొక్కలు సజీవ వేరు వ్యవస్థతో మట్టిని సారవంతం చేస్తాయి. భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు వృద్ధి చెందుతాయి. జీవ వైవిధ్యం మెరుగుపడుతుంది.
- నవధాన్యాల పంట చేనులో పోషక విలువలు మెండుగా ఉంటాయి. పశువులకు పచ్చిమేతగా ఉపయోగపడుతుంది.
- 45 రోజుల తర్వాత కలియ దున్నడం వల్ల పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడతాయి.
- ఖరీఫ్‌లో వేసే ప్రధాన పంటకు సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా అందుతాయి.
- ప్రధాన పంటకు ఎరువుల ఖర్చు తగ్గుతుంది.
- మట్టి సముదాయత పెరగడం వల్ల ప్రధాన పంటలో కలుపుతగ్గుతుంది
- ప్రధాన పంటకు చీడపీడలు, తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం, దిగుబడి పెరుగుతుంది.
- ప్రధాన పంటకు వాతావరణ వైపరీత్యాలపు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.

రైతులకు అదనపు ఆదాయం



రైతులంతా వేసవి నువ్వుల పంట సాగు చేసి, అంతర పంటలుగా నవధాన్యాలను సాగు చేయాలి. నవధాన్యాల సాగుతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత పొందవచ్చు. జిల్లా వ్యాప్తంగా నువ్వులు, అంతర పంటలుగా నవధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. రైతులకు అవగాహ న కల్పిస్తున్నాం. రాయితీపై విత్తనాల కిట్లను అందిస్తున్నాం.

– ప్రకాష్, ప్రకృతి వ్యవసాయ ఆర్టీఎల్

బహుళ ప్రయోజనాలు



నవధాన్యాల సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రైతులకు అదనపు ఆదాయం రావడంతో పాటు భూమి సారవం తమవుతుంది. ఖరీఫ్‌లో సాగుచేసే వరి, ఇతర ప్రధాన పంటలకు సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గుతుంది. వేపాడ మండల రైతులకు ఇప్పటి వరకు మొదటి విడతలో నవధాన్యాల విత్తన కిట్లను 3,500 వరకు పంపిణీ చేశాం.రెండో విడతలో మరింతమంది రైతులకు పంపిణీ చేస్తాం.

– కె.సన్యాసమ్మ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్

• రుద్రాభిషేకం



తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓం సదనం ఆశ్రమంలో చైత్రమాసం మాస శివరాత్రి, శనిత్రయోదశి సందర్భంగా శనివారం 108 శివలింగాలకు మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు అంపోలు ఉమామహేశ్వరరావు, భక్తులతో కలిసి శివలింగాలకు బిల్వార్చన, పుష్పార్చన, నవగ్రహ హోమం, తదితర పూజలు చేశారు. – కొత్తవలస

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ర్యాలీ చేస్తున్న మొబైల్ దుకాణాల నిర్వాహకులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ర్యాలీ చేస్తున్న సినిమా థియేటర్ల వర్కర్స్



చీపురుపల్లిరూరల్(గరివిడి): అర్తమూరులో ర్యాలీ చేస్తున్న యువకులు, విద్యార్థులు

చీపురుపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని చీపురుపల్లి పట్టణంలోని మొబైల్ షాపుల అసోసియేషన్, సినిమా థియేటర్ల వర్కర్స్ ఖండించారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ శనివారం సాయంత్రం వేర్వేరుగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ నుంచి మెయిన్ రోడ్, మూడురోడ్ల జంక్షన్, లావేరు రోడ్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

అర్తమూరులో...

చీపురుపల్లిరూరల్(గరివిడి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ గరివిడి మండలంలోని అర్తమూరులో శ్రీ విజయగౌరీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని యువత, విద్యార్థులు ప్రార్థించారు.

వ్యవసాయ మోటార్ల కేబుళ్ల అపహరణ

మెరకముడిదాం: భీమవరం గ్రామంలో వ్యవసాయ మోటార్లకు చెందిన విద్యుత్ కేబుళ్ల అపహరణకు గురవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు రఘుమండ జయలక్ష్మి, బందపు దాలప్పయ్య, బందపు ఎరకయ్య, బందపు చినఅప్పయ్య, రఘుమండ అప్పలస్వామికి చెందిన వ్యవసాయపంపుసెట్ల విద్యుత్ కేబుళ్లను శుక్రవారం రాత్రి దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. గతంలో ఇదే గ్రామంలో ఆరుగురు రైతులకు చెందిన మోటారు విద్యుత్ వైర్లను ఇలాగే ఎత్తుకెళ్లిపోయారని రైతులు చెబుతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

15శాతం వృద్ధిరేటు సాధించేలా ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

శృంగవరపుకోట: జిల్లాలో 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు అనుగుణంగా గ్రామస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులకు సూచించారు. స్థానిక శిరికి రిసార్ట్స్‌లో నియోజకవర్గ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినూత్నంగా, విభిన్నంగా ఆలోచన చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, వాటిని పటిష్టంగా అమలు చేసి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లాలో ప్రాథమిక రంగంలోనే ఎక్కువ అభివృద్ధి సాధించే అవకాశం ఉందని, వ్యవసాయ యోగ్యమైన భూమి జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకూ ఉందని, ప్రస్తుతం 1.80 లక్షల ఎకరాలే సాగవుతోందన్నారు. మిగులు భూమిని దశల వారీగా సాగులోకి తెచ్చి వివిధ రకాల పంటలు, అంతర పంటలు, ఉద్యానవన, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించి, ఉత్పాదకత పెంచాలన్నారు. పాలు, మాంస ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి పెంచాలన్నారు. ప్రతి మండలంలో ఒక పౌల్ట్రీ, డెయిరీ ఏర్పాటయ్యేలా చూడాలని, జిల్లాకు రోజుకు 10లక్షల లీటర్ల పాలు అవసరం కాగా ప్రస్తుతం రోజుకు 6 లక్షల లీటర్లు వస్తున్నాయని, ఈ లోటును భర్తీ చేయాలని కోరారు. చెరువుల్లో చేపల పెంపకాన్ని యుద్ధ ప్రాతిపదికన పెంచాలని, పారిశ్రామిక అభివృద్ధి కోసం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి భౌగోళిక పరిస్థితులు, వనరులు, వసతులు అన్నీ అధ్యయనం చేసి, గ్రామస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సీపీఓ పి.బాలాజీ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ -2047 ప్లానింగ్‌లోని పది సూత్రాలను, మండలాల వారీగా జీడీపీ, జీవీఏ లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు.అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్ తిలకించి, రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ, ఉద్యానవన శాఖ డీడీ ఏ.వి.ఎస్.వి.జమదగ్ని, ఏపీఎంఐపీపీడీ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఆనందరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి మురళి, విజయనగరం ఆర్డీఓ కీర్తి, నియోజకవర్గంలోని అయిదు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, అనుబంధశాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న గిరిజనులు



మారిక గ్రామానికి వెళ్లకుండా అధికారులను అడ్డుకుంటున్న గిరిజనులు

వేపాడ: అదానీ పవర్ ప్లాంట్ కోసం మారిక గ్రామంలో భూసేకరణకు జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను గ్రామంలో అతికించేందుకు ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది శనివారం ఆ గ్రామానికి వెళ్లగా... స్థానిక గిరిజనులు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు జగన్ అడ్డుకున్నారు. అదానీ పవర్ ప్లాంట్‌కు భూములు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ అధికారులు ప్రజల పక్షాన కాకుండా అదానీ సేవలో మునిగిపోవడం అన్యాయమన్నారు. ఏకంగా గ్రామాన్ని అదానీకి రాసిచ్చేస్తాం అంటే గిరిజనుల బతుకులు ఏం కావాలని ప్రశ్నించారు.ప్రాణాలు పోయినా సరే గ్రామాన్ని, భూములను వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు.రిక్విజేషన్ డిపార్ట్‌మెంట్ వారి సమాచారం మేరకు మారిక రెవెన్యూలో సర్వేనంబర్ 1 నుంచి 32 వరకు సమారు 213.80 ఎకరాల భూమిని గిరిజనులు కోల్పోతున్నారన్నారు. మారిక గ్రామాన్ని, భూములను వదులుకునేందుకు సిద్ధంగా లేమని, ఎవరు వచ్చినా అడ్డుకుంటామని తేల్చి చెప్పేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

లాడ్జీలు, వాహన తనిఖీలు



చీపురుపల్లి: లాడ్జీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ దామోదరరావు



వేపాడ: వాహన తనిఖీలుచేస్తున్న ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, వేపాడ ఎస్ఐ సుదర్శన్

చీపురుపల్లి: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పట్టణంలో ఎస్ఐ ఎల్.దామోదరరావు పోలీస్ సిబ్బందితో లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించడంతో పాటు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ చెప్పారు. లాడ్జీల్లో రికార్డులను పరిశీలించి, గదుల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించారు. వారి వద్ద గుర్తింపు కార్డులు పరిశీలించారురు. అలాగే చీపురుపల్లి నుంచి రాజాం, లావేరు వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

సంజీవమెట్టవద్ద..

వేపాడ: మండలంలోని వావిలపాడు పంచాయతీ సంజీవ మెట్ట వద్ద దేవరాపల్లి- ఆనందపురం రహదారిలో వల్లంపూడి పోలీసులు శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ పోలీసు సిబ్బందితో కలిసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఘనంగా అప్పలనరసయ్య పుట్టినరోజు వేడుకలు

గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు.



శృంగవరపుకోట: జామి మండలంలోని భీమసింగిలో వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక



బొండపల్లి: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ప్రభూజీ, ఎంపీపీ చలం నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంనాయుడు



గంట్యాడ: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ హైమావతి , జెడ్పీటీసీ నరసింహమూర్తి



దత్తిరాజేరు: వేడుకల్లో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

- గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు కేక్ కట్ చేశారు. నాయకులు రెడ్డి పద్మావతి, బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినా రాయణ, రేగ సురేష్ ,కె.పైడిపునాయుడు, కె.సుబ్రహ్మణ్యం, కె.రామునాయుడు,లెంక గణేష్ పాల్గొన్నారు.
- బొండపల్లి: గొట్లాం గ్రామంలోని సత్య ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.ప్రభూజీరాజు, ఎంపీపీ చల్లా చలం నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. నాయకులు మీసాల తులసీరాం, బండారు బంగారం,మహంతి రమణ పాల్గొన్నారు.
- గంట్యాడ: రామవరంలో ఎంపీపీ పీరుబండి హైమావతి తన నివాసంలో కేక్ కట్ చేశారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, రామవరం సర్పంచ్ పీరుబండి పద్మ , నాయకులు వెలగాడ రామసూర్యం, లచ్చిరెడ్డి కృష్ణ, కోడెల ముత్యాలనాయుడు, చప్ప చిన్న, కరక శ్రీను, కె. కొండలరావు పాల్గొన్నారు.
- దత్తిరాజేరు: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఫణీంద్రుడు నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు కేక్ కట్ చేశారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- శృంగవరపుకోట: జామి మండలంలోని భీమసింగిలో వైఎస్సార్‌సీపీ సీనియర్‌నేత పాండ్రంగి సంజీవి నివాసంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కిలారి సూర్యారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రవి, ధర్మరెడ్డి చందు, అప్పాన సుబ్రహ్మణ్యం, జన్ని సూరిదేముడు, వెంకటరావు, మాజీ ఎంపీటీసీ అప్పలరాజు, గేదెల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఎక్సలెన్స్ అవార్డు



విశాఖలో అవార్డుఅందుకుంటున్న ధనరాజు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని ఐసీటీసీ విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నల్ల ధనరాజు సేవలను గుర్తించి ఆంధ్రా మెడికల్ కాలేజ్ విశాఖపట్నం వారు ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేశారు. ఆ కాలేజ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల మైక్రో బయాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ శివకల్యాణి, డాక్టర్ శిరీష, తదితరులు ధనరాజుకు అవార్డు, సర్టిఫికేట్ అందజేశారు. గజపతినగరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రాణి, స్థానిక డాక్టర్ వసుద తదితరులు ధనరాజుకు అభినందనలు తెలిపారు.

మద్యంతో ఆరోగ్యం చిత్తు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

చీపురుపల్లి: మద్యానికి బానిసగా మారితే ఆరోగ్యం చిత్తవుతుందని, జీవితాలు నాశనమవుతాయని ప్రొహిబిషన్,ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) సీహెచ్.చక్రవర్తి అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆటోడ్రైవర్లు, ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం వల్ల ఎన్నో అనర్థాలు ఉంటాయన్నారు. కష్టపడిన డబ్బులతో మద్యం కొనుగోలు చేసుకుని తాగితే ఇళ్లు గుల్లవుతుందని చెప్పారు. మద్యం, గుట్కా, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరం గా ఉండాలని సూచించారు.ఎస్ఐ గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మధుపాడలో పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడిక తీయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రోస్లీ

సాక్షి ఎఫెక్ట్...

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రోస్లీ పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో కొన్నాళ్లుగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో సమస్యపై 'ఎక్కడ చూసినా.. చెత్తే..!' శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. గ్రామంలో ని మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. అలాగే బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. గ్రామంలో ఆరుబయట, ఎక్కడపడితే అక్కడ చెత్త పారబోయవద్దని గ్రామంలో దండోరా వేయించారు.